RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 231 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 07-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

వాదులాట పెరుగు వాదించుకొన్నచో
చర్చచేసుకొనిన సద్దుమణుగు
కలిసియున్నతోడ కలుగుసుఖమెపుడు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## ముగిసిన పుతిన్ భారత పర్యటన

- కీలక మలుపు తిప్పిన పుతిన్ రాక

న్యూఢిల్లీ,
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండురోజుల భారత పర్యటన ముగిసింది. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందుకు హాజరయ్యారు. విందు ముగిసిన తర్వాత అక్కడి నుంచి పుతిన్ నేరుగా విమానాశ్రయానికి చేరుకున్నారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విమానాశ్రయానికి వెళ్లి వీడ్కోలు పలికారు. 'కలిసి సాగుదాం, కలిసి ఎదుగుదాం'.. అన్న నినాదంతో పుతిన్ తన భారత పర్యటనకు ముగింపు పలకడం విశేషం. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోడీ స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము అధికారికంగా స్వాగతం పలికారు. భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్ - రష్యా మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. రక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోడీ వివిధ -మిగతా 2 లో

## ఎవరు అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను
# పూర్తిచేసి తీరుతాం

### ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం



- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజలను పట్టించుకోకుండా నిరంకుశంగా కేసీఆర్ పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సీఎం రేవంత్

దేవరకొండ, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ. 23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం -మిగతా 2 లో

TELANGANA RISING 2047

## నగరంలో తెలంగాణ రైజింగ్ ఆకర్శణలు

- ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్ ను అందంగా ముస్తాబు
- భారీగా ఏర్పట్లతో పాటు..హంగూ ఆర్భాటం
- పలుచోట్ల ప్రత్యేక ఆకర్శణ తోరణాలు

హైదరాబాద్,డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్ ను అందంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ హంగులు ఓ వైపు, తెలంగాణ ప్రత్యేక ఎట్రాక్షన్స్ మేళవింపుతో మరో వైపు జరుగుతున్న ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రముఖ ప్రదేశాలు, చెరువులు, రహదారులు, సమ్మిట్ వేదిక.. ఇలా అన్ని చోట్లా హైటెక్ ప్రొజెక్షన్లు, డిజిటల్ రూపంలో ప్రదర్శనలు , ఆధునిక విజువల్ ఎఫెక్టులతో ప్రత్యేకంగా పెట్టుబడుల పండగ వాతావరణం సృష్టించ నున్నారు. చార్మినార్ తో పాటు కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ -మిగతా 2 లో



## వెనిజులా లక్ష్యంగా అమెరికా దాడులు

- అక్రమ రవాణా చేస్తున్నదన్న నెపంతో ఒక పడవపై అమెరికా వైమానికి దాడి
- దాడిలో నలుగురు మృతి
- మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశాలు

వాషింగ్టన్ -
వెనిజులా లక్ష్యంగా అమెరికా కరేబియన్ సముద్రతీర ప్రాంతంలో దాడులను కొనసాగిస్తుంది.. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నదన్న నెపంతో ఒక పడవపై అమెరికా వైమానికి దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మృతి చెందారని పెంటగాన్ వెల్లడించింది.. ఉగ్రవాదసంస్థ అంతర్జాతీయ జలాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న పడవపై దాడి చేశామని యూఎస్ రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సేట్ ఎక్స్‌లో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులా గగనతలాన్ని మూసేసిన అనంతరం ఈ దాడి జరగటం గమనార్హం. ట్రంప్ ప్రభుత్వంపై వెనిజులాపై దాడుల నేపథ్యంలో అమెరికన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రక్షణశాఖ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగాయని యూఎస్ సదరన్ కమాండ్ ధృవీకరించింది. కాగా యూఎస్ జరుపుతున్న వరుస దాడులపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అమెరికా ఖాతరు -మిగతా 2 లో

## విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు

- ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు కదా
- కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ పిలుపు

హైదరాబాద్,డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. -మిగతా 2 లో



## తెలంగాణ భవితకు బాట
# గ్లోబల్ సమ్మిట్

### రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్శించడమే లక్ష్యం



- విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచాన్ని ఆకర్శిస్తాం
- 8న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభోత్సవం
- మీడియాకు వెల్లడించిన మంత్రుల భట్టి, శ్రీధర్ బాబు



హైదరాబాద్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ కు సంబంధించిన సమ్మిట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మిట్ ఉపయోగ పడుతుందన్నారు. గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. మొత్తం 27 సెషన్లు -మిగతా 2 లో

## జగన్‌కు దేవుడన్నా లెక్కలేకుండా పోయింది

### శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు

- పరకామణి దొంగతనం చిన్నది ఎలా అవుతుంది
- దానిని సెటిల్‌మెంట్ ఎలా చేస్తారు
- జగన్ మూలంగా మాఫియాలు తయారయ్యారు
- శాంతిభద్రతలపై రాజీపడేది లేదు
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా మాట్లాడే తీరు అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మండిపడ్డారు. శనివారం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో -మిగతా 2 లో

## సుప్రీంకోర్టుకు చేరిన ఇండిగో సంక్షోభం..

### విమానాల రద్దుపై సుప్రీంలో పిటిషన్



- మానవతా సంక్షోభం నెలకొందని పిల్
- తక్షణమే జోక్యం చేసుకోవాలని కోర్టుకు అభ్యర్థన

న్యూఢిల్లీ, -
ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్' పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యం కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో 'మానవతా సంక్షోభం' తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వృద్ధులు, పసిపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారితో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీరు, విశ్రాంతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు -మిగతా 2 లో

# ఎవరు అడ్డుపడ్డా ఎస్‌ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం'

మొదటి తరువాయి

అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్ సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్‌ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో



ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం' అని సీఎం అన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలోపేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు. పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. 'కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా..? అయినా.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్‌ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగిందని.. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సభలో పాల్గొన్నారు.

# విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు

మొదటి తరువాయి

సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా




తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుందని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేవని, బీఆర్‌టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చని వివరించారు. లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుందన్నారు. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు

# తెలంగాణ భవితకు బాట గ్లోబల్ సమ్మిట్

మొదటి తరువాయి

ఉంటాయన్నారు. తెలంగాణ విజన్ డాక్యుమెంటరీ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తామని చెప్పారు. ఈ మేరకు శనివారం గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కలిసిన భట్టి సమ్మిట్‌కు ఆహ్వానించారు. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగిస్తారని చెప్పారు . మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుందని.. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుందని తెలిపారు. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుందన్నారు డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ మళ్లీ ప్రారంభం అవుతుందని భట్టి చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంద న్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కోరుకునే వారు ఈ సమ్మిట్ లో పాల్గొనవచ్చని చెప్పారు. ఇండిగో విమాన సమస్య ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమైన వాళ్లు రావడానికి ఇబ్బంది ఉంటే వాళ్లకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు' అని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ అజెండా ఖరారైంది. సోమ, మంగళవారాల్లో ఫ్యూచర్‌సిటీ వేదికగా ఈ సమిట్ జరగనుంది. అంగరంగ వైభవంగా అంతర్జాతీయ ఆర్థిక సదస్సు నిర్వహణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రెండ్రోజుల సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. 8, 9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని 'ఫ్యూచర్ సిటీ'లో 100 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు హాజరు కానుండడంతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు సిద్ధమవుతున్నాయి. 9న సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా పాల్గొననున్నారు. క్రియేటివ్ సెషన్‌లో రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గుణీత్ మోంగా, అనుపమ చోప్రా పాల్గొంటారు.

# జగన్‌కు దేవుడన్నా లెక్కలేకుండా పోయింది

మొదటి తరువాయి

పలు కీలక అంశాలపై మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చిట్‌చాట్ చేశారు. శ్రీవారి పరకామణి దొంగతనం వ్యవహారంపై జగన్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. పరకామణి దొంగతనం చిన్న దొంగతనం అంటూ జగన్ వ్యాఖ్యలు అందరినీ విస్తుగొలిపాయని చెప్పుకొచ్చారు. జగన్‌కు దేవుడన్నా లెక్కలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలన్నా లెక్కలేదని... ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని ధ్వజమెత్తారు. 'జగన్ తన బాబాయి వివేకా హత్యనే సెటిల్ చేసుకుందామని చూశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూశారు.. ఇంతకంటే ఘోరం ఉంటుందా? దొంగతనాన్ని కూడా తప్పు కాదని చెప్పే వాళ్లను ఏమనాలని ఆగ్రహం చెందారు.సెంటిమెంట్ విషయాల్లో కూడా సెటిల్‌మెంట్ అంటూ వ్యాఖ్యాలా.? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి కట్టాడు కదా...తప్పేముందని జగన్ అత్యంత అనైతికంగా వాదిస్తున్నారు. భక్తులు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశంలోనూ భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉంటుంది. అలాంటి సున్నిత అంశాలను కూడా సెటిల్‌చేశామని తేలికగా జగన్ మాట్లాడుతున్నారు. భక్తుల ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్ ఏంటని అన్నారు. శ్రీవారి హుండీలో చోరీపై జగన్ చేసిన వ్యాఖ్యలపై అన్నివర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ఆ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు. రూ.72 వేలు అనేది చిన్న దొంగతనమని చెబుతున్నాడు. దేవుడు హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా? కోట్ల మంది భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా పరకామణి విషయంలో జగన్ ఇలాంటి వ్యాఖ్యలు ఘోర పాపం కాదా' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.ఏమాత్రం నైతికత లేని వాళ్లే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని మండిపడ్డారు. తిరుమల పరకామణిలో రూ.70వేల చోరీకి రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటే ఇంకెంత సంపాదించి ఉంటారని ప్రశ్నించారు. తితిదేలో దోపిడీ ఏ స్థాయిలో చేశారో దీనిబట్టే అర్థమవుతోందన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జగన్‌కు దేవుడన్నా, ఏడుకొండల వాడి భక్తుల మనోభావాలు అన్నా, ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని దుయ్యబట్టారు. చుక్క పాలు లేకుండానే నెయ్యి తయారు చేసి దేవుడి ప్రసాదానికి సరఫరా చేసిన ఘనులా వీళ్లు అని సర్వత్రా చర్చ జరుగుతోంది. గతంలో నెల్లూరు, విజయనగరం జిల్లాలు ఎంతో ప్రశాంతంగా ఉండేవి.. వైకాపా హయాంలో నెల్లూరులో కూడా చాపకింద నీరులా మాఫియాను విస్తరింపజేశారు.

# నగరంలో తెలంగాణ రైజింగ్ ఆకర్షణలు

మొదటి తరువాయి

TELANGANA RISING 2047

ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చూపించనున్నారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సెక్రటేరియట్ వద్ద అద్భుతమైన త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా చూపించడానికి ప్రణాళిక రూపొందించారు. రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ డిస్ ప్లేలు ఉండనున్నాయి. దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్ తో అద్భుతంగా ప్రదర్శించనున్నారు. హుస్సేన్ సాగర్ లో వాటర్ ప్రొజెక్షన్ ద్వారా ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువత?రైతు ప్రధాన కార్యక్రమాలు, మూడు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం లాంటి ముఖ్య అంశాలను చూపించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి సమ్మిట్ వేదిక వరకు వెళ్లే అప్రోచ్ రోడ్డుపై భారీ డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్క్రీన్ల మీద భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి.. ఎంత దూరం.. వంటి వివరాలు పొందుపరుస్తారు. నగర వ్యాప్తంగా గ్లోబల్ సమ్మిట్ లోగోతో తయారు చేయించిన 1500 రంగురంగుల జెండాలతో వేడుక వైభవాన్ని చాటనున్నారు. సమ్మిట్ వేదిక వద్ద లోపలికి వెళ్లే మార్గం మొత్తం ఆధునిక త్రీడీ ఎనీమార్ఫిక్ డిజైన్లు రూపొందిస్తున్నారు. 50 మీటర్ల పొడవుతో డిజిటల్ టన్నెల్ ను ఇంటరాక్టివ్ డిస్ ప్లే రూపంలో ఏర్పాటు చేసి, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు పురోగతిని విజువల్స్ ద్వారా చూపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.హైదరాబాద్ నగరంలో పది వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక సమాచార స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, డిజిటల్ స్క్రీన్లపై విజువల్స్, సమ్మిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచనున్నారు. అక్కడున్న వలంటీర్లు ప్రజలకు సమ్మిట్ డైలీ షెడ్యూల్ ను వివరించి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి లో తెలంగాణ అందరి దృష్టిని ఆకర్శించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

# ముగిసిన పుతిన్ భారత పర్యటన

మొదటి తరువాయి

బహుమతులు అందించారు. ఇందులో రష్యన్ ఎడిషన్ భగవద్గీత, కాశ్మీరీ కుంకుమ పువ్వు, అసోం బ్లాక్ టీ, బెంగాల్ ముర్షీదాబాద్‌కు చెందిన వెండి టీ సెట్, మహారాష్ట్రలో చేతితో తయారు చేసిన వెండి గుర్రం, ఆగ్రా నుంచి తెచ్చిన మార్బుల్ చెస్ సెట్ వంటివి ఉన్నాయి. పుతిన్ పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ మరో కీలక ప్రకటన చేశారు. రష్యన్లకు 30 రోజులపాటు ఉచిత ఇ టూరిస్టు, గ్రూప్ టూరిస్టు ఉచిత వీసాలను త్వరలో ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పుతిన్‌తో కలిసి సంయుక్తంగా జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని మోడీ వెల్లడించారు. అందువల్ల రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలూ బలపడతాయని ఆయన ఆకాంక్షించారు. భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహార భద్రత, నౌకాయానం, ఎరువులు, విద్య, భారత్ నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు ఇవి దోహదపడ నున్నాయి. మాస్కోతో వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో దిల్లీకి సాయపడనున్నాయి. భౌగోళిక రాజకీయాలు ఎన్నెన్నో కుదుపులకు లోనైనప్పటికీ.. భారత్-రష్యా స్నేహం ధ్రువతారలా నిరంతరం వెలుగులీనుతూనే ఉందని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత మార్గాల్లో ముగింపు పలకాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరమ్‌లోనూ మోదీ, పుతిన్ పాల్గొన్నారు. గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. మానవాళి అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంది. వాటన్నింటినీ తట్టుకుంటూ భారత్-రష్యా మైత్రి ధ్రువతారలా నిలిచి ఉంది. పరస్పర గౌరవం, బలమైన విశ్వాసం అనే పునాదులపై ఈ బంధం నిర్మితమైంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై పుతిన్, నేను చర్చించారు. భారత్, రష్యా మధ్య మానవ వనరుల రాకపోకలను సులభతరం చేసేలా రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

# వెనిజులా లక్ష్యంగా అమెరికా దాడులు

మొదటి తరువాయి

చేయడంలేదు. ఇటీవల మదురోతో ఫోన్‌లో మాట్లాడానని స్వయంగా ట్రంప్ వెల్లడించారు. అయితే ఏం మాట్లాడానో చెప్పనని మీడియా ఎదుట వాపోయారు. అనంతరం వెనిజులా తీరాలకు సమీపంలో అమెరికా భారీ సైనిక వనరులను మోహరించటం వేగవంతం చేసింది. త్వరలో మిలిటరీ దాడులు జరిగే అవకాశం ఉన్నదని పలువురు హెచ్చరిస్తున్నారు. అయితే వెనిజులా మాత్రం అమెరికా చర్యలను ఖండించింది. ధీటుగా సమాధానమిస్తున్నది. అమెరికా చర్యలు తమ పభుత్వాన్ని కూల్చివేయడానికి చేస్తున్న ప్రయత్నాలను సాగనీయమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు.

# సుప్రీంకోర్టుకు చేరిన ఇండిగో సంక్షోభం..

మొదటి తరువాయి

పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌరుల జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు తీవ్ర విఘాతం కలిగించడమేనని తెలిపారు. పైలట్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన విమాన డ్యూటీ సమయ పరిమితి నిబంధనల అమలులో ప్రణాళిక లోపం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడ్డాయని ఇండిగో బహిరంగంగా అంగీకరించింది. అయితే, ఈ మార్పులను ముందుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ఇండిగోతో పాటు డీజీసీఏ కూడా విఫలమయ్యాయని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కీలక మార్గాల్లో టికెట్ ధరలను రూ.50,000 వరకు పెంచి ప్రయాణికులను బందీలుగా మార్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విమానాల రద్దు వల్ల చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఇతర విమానాల్లో లేదా రైళ్లలో ఉచితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ఇండిగోను ఆదేశించాలని అభ్యర్థించారు. అలాగే డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకై పోరాటం కొనసాగిస్తాం : యుఎస్ఎఫ్ఐ




**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) నగర కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి అల్లపు అభిలాష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వాలు ఆయన కోరుకున్న ఆశయాలను విస్మరించడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాజ్యాంగం అందించినప్పటికీ అందరికీ నాణ్యమైన విద్య అందించడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చేసే ప్రయత్నాలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని, దానికి అంబేద్కర్ ఆదర్శమని అన్నారు.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రజల్లో చైతన్యం పెంచుతూ నిరంతర పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, విజయ్, వర్ధరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలు



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.మొదటి, రెండవ దశ పోలింగ్ పూర్తయినా సంబంధిత గ్రామాలు, మండలాల్లో కోడ్ కొనసాగుతుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత మాత్రమే ఎంసీసీ తొలగిపోతుందని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాల్లో కూడా కోడ్ అమలులోనే ఉంటుందని స్పష్టం చేశారు.నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఎన్నికలకు దూరం చేసేలా చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన అదనపు కలెక్టర్




**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను శనివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంలను తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపుతున్నామని తెలిపారు. ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరును పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎం, వివిప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, సిపిఐఎం ప్రతినిధి మిల్కురి వాసుదేవ రెడ్డి, ఎంఐఎం ప్రతినిధి బర్కత్ అలీ, బిఎస్పీ ప్రతినిధి సిరిసిల్ల రాజయ్యతో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మంకమ్మ తోటలోని జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ అంబేద్కర్ అణగారిన వర్గాల హక్కుల కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా, మహిళా స్వేచ్ఛ కోసం, కుల నిర్మూలన కోసం అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అత్యవసరమని, సహజ వనరుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్యా వైద్యం పేద వర్గాలకు అందే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్, కండె రాజు, పులిపాక సాయికుమార్, దాసరి కనకేష్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వినయ్ సాగర్, కెవిపిఎస్ జిల్లా నాయకుడు కాదశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు లెజెండ్ విద్యార్థి ఎంపిక



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భగత్ నగర్‌లోని లెజెండ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రేష్ట నందిని రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుండి ఆదిలాబాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న 36వ సౌత్ జోన్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్‌లో ఆమె పాల్గొననుంది. 8వ తరగతి చదువుతున్న శ్రేష్ట నందిని ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ రాజయ్య ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను అభినందిస్తూ, క్రీడల ద్వారా విద్యార్థులు శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణతో వివిధ స్థాయి పోటీలలో పాల్గొనేలా సిద్ధం చేస్తున్నామని, అవసరమైన వనరులు కల్పించి వారి ప్రతిభను వెలికి తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులు

**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా కోర్ట్ చౌరస్తాలో జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుడు అంబేద్కర్ అని, రిజర్వేషన్ ఫలాలు ఆయన కృషి వల్లే సాధ్యమయ్యాయని అన్నారు. అణగారిన వర్గాలు స్వేచ్ఛగా జీవించగలగడం అంబేద్కర్ పోరాట ఫలితమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచన విధానాలను కొనసాగిస్తామని హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు చంటి శ్రీనివాస్, జంగ అపర్ణ సాగర్, కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, హుస్నాబాద్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హోం గార్డుల సేవలు ప్రశంసనీయం



**పెద్దపల్లి, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 63వ హోం గార్డ్ రైసింగ్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. హెడ్‌క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో హోం గార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించగా, కమాండర్‌గా ఆర్ఐ పెద్దన్న వ్యవహరించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించి సిబ్బంది ప్రదర్శనను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం గార్డుల త్యాగం, సేవాస్ఫూర్తి మరువలేనివని, శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్ నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్, విపత్తు నిర్వహణ వంటి విభాగాల్లో వారు చూపుతున్న అంకితభావం ప్రశంసనీయం అని అన్నారు. ప్రతి డ్యూటీని క్రమశిక్షణతో నిర్వహిస్తున్న హోం గార్డులు పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీ పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ వేడుకలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ భీమేష్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, సంపత్, ఆర్ఎస్ఐలు, హోం గార్డ్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్



**పెద్దపల్లి, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల ప్రారంభమైన పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం సందర్శించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితిని అధికారుల నుంచి తెలుసుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేస్తూ, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచి, రికార్డుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, విజిబుల్ పోలీసింగ్, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతం కావాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## గాయత్రి కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు



**పెద్దపల్లి, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి టాస్క్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందారు. డి. స్రవంతి, సానియా తరణం, కే. శశాంక, కే. మానస వీరు టాటా ఎలక్ట్రానిక్స్‌లో, నాజరిన్ సుల్తానా ఆప్టికల్ హెల్త్ సొల్యూషన్స్ మరియు టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగాలు సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు కృతజ్ఞతలు తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులను గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జే. రవీందర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులు

**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లో ఎంపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

# సిపిఐ జిల్లా కార్యవర్గంలో న్యాలపట్ల రాజు



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నగరానికి చెందిన న్యాలపట్ల రాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు.కట్టారాంపూర్‌కు చెందిన రాజు గత 30 సంవత్సరాలుగా సిపిఐలో పనిచేస్తూ, పార్టీలో మరియు ప్రజా సంఘాలలో వివిధ హోదాల్లో సేవలందించారు. ప్రస్తుతం సిపిఐ నగర సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీ నిర్మాణ దృష్ట్యా, జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారని శ్రీనివాస్ తెలిపారు.జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రాజు, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు.

# శాతవాహనలో దక్షిణ మండల వాలీబాల్ సెలక్షన్స్




**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సౌత్ జోన్ అంతర్విశ్వవిద్యాలయ వాలీబాల్ టోర్నమెంట్‌కి ఎంపికలు జరిగాయి. ఈ పోటీలు ఈనెల 10 నుండి 14 వరకు కాకినాడ జెఎన్‌టియు లో జరగనున్నాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చదువులతో పాటు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అవసరమైతే హైదరాబాద్ నుండి శిక్షకులను పిలిపించి తగిన శిక్షణ అందిస్తామని తెలిపారు.ఓఎస్‌డీ టు విసి డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ క్రీడాకారులు తమ విశ్వవిద్యాలయానికి, విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. మనోజ్ కుమార్, పిఆర్ఓ, పిడి విజయకుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వరరావు, శ్రీనాథ్, సతీష్ రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. దుర్షేడ్ గ్రామానికి చెందిన అలకుంట్ల వెంకటనర్సు, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగపురి శ్రీనివాస్ అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అదనంగా, ఏఎంఆర్ఓ ముందు లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు

**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు.మొదట జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్ తదితరులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు.తరువాత నగర కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో కోర్ట్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే



ఆరెపల్లి మోహన్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు తదితరులు హాజరై ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం సమాన హక్కులను కల్పించి కుల, మత, వర్గ విభేదాలకు ముగింపు పలికిందని, ఆయన ఆశయాలను సూర్యచంద్రులు ఉన్నంతవరకు గుర్తుంచుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలను ప్రజలు గమనించి అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 63వ హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవం



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో 63వ హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గౌష్ ఆలం హోంగార్డుల సేవలను ప్రశంసిస్తూ ప్రత్యేక సందేశం ఇచ్చారు. హోంగార్డ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, 1946లో బాంబేలో ప్రారంభమైన ఈ వ్యవస్థ అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, బందోబస్తు విధులు, ప్రజా రక్షణలో అమూల్యమైన సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. విధుల్లో అంకితభావం కనబరిచిన హోంగార్డులను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, ఇతర క్రీడా పోటీల్లో విజయం సాధించిన సిబ్బందికి ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలు శారీరక సామర్థ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు విజయకుమార్, వెంకటస్వామి, యాదగిరిస్వామి, హోంగార్డు ఆర్ఐ శ్రీధర్ రెడ్డి, ఇతర ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# రోళ్ళవాగు ప్రాజెక్ట్ అనుమతులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి



**జగిత్యాల, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీర్పూర్ మండలంలోని రోళ్ళవాగు ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఎంపీని అభ్యర్థించగా, అర్వింద్ ఢిల్లీలో మంత్రి కార్యాలయంలో కలసి విన్నవించారు.అదే విధంగా జగిత్యాల అర్బన్ మండలంలో అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి కోసం నగర్ వన్ యోజన కింద కేంద్రం రెండు కోట్లు మంజూరు చేసింది. ఇందులో 1.4 కోట్లు విడుదల కాగా, మిగిలిన 60 లక్షలు విడుదల కావాల్సి ఉందని, వాటిని తక్షణమే విడుదల చేయాలని ఎంపీ కోరారు. సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి, త్వరలోనే నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రోళ్ళవాగు ప్రాజెక్ట్‌తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నందుకు ఎంపీ అర్వింద్‌కు బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, సిరికొండ రాజన్న కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా అంబేద్కర్ 69వ వర్ధంతి



**అచ్చంపేట, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, భారతదేశానికి దిశా దశ మార్గాన్ని చూపిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగం చదవకపోతే హక్కులు తెలియవని, ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.అంబేద్కర్ రాజ్యాంగం రాయకపోతే తాను ఎమ్మెల్యే అవ్వలేనని, ఆయన కల్పించిన అవకాశాల వల్లే ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ స్థానం లభిస్తుందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని సూచించారు.అచ్చంపేట పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్స్ అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రజిత, మల్లేశమ్మ, మహేశ్వర చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, ఎస్ఎస్ఎల్ తాలూకా అధ్యక్షుడు రాజగోపాల్, మహబూబ్ అలీ, కొండూరు శేఖర్, కపిలవాయి శేఖర్, అంబేద్కర్ సంఘం నాయకులు పాతుకుల శ్రీశైలం, రామకృష్ణ, కొంకి విజయ్, ఆనందు, బండారు పర్వతాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడు మోతే జంగయ్యకు నివాళులు



**అచ్చంపేట, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణం 8వ వార్డ్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు మోతే జంగయ్య మరణించిన విషయం తెలిసి ఆయన స్వగృహానికి వెళ్లి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి ఆర్థిక సహాయం చేసిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో పాటు మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, కౌన్సిలర్ రాఘవులు, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎస్ కే.ఖాదర్, ముత్యాల తిరుపతయ్య గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానం



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి, మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మరియు డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజన్ తెలంగాణ 2047కి సంబంధించిన గ్లోబల్ సమ్మిట్ ఈనెల 8, 9 తేదీలలో రెండు రోజులపాటు జరగనుంది. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులను ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా బండి సంజయ్‌కు ఆహ్వానం అందించబడింది. తెలంగాణ కూడా దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని, 3 ట్రిలియన్ లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ఫ్యూచర్స్ సిటీతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర వృద్ధి సాధించేందుకు కేంద్రం, రాష్ట్రం, అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అబ్దుల్ కలాం ఆజాద్ చెప్పినట్లు కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవడానికి శ్రమపడాలని, 2047 డాక్యుమెంట్ వాస్తవానికి దగ్గరగా ఉండేలా ఐక్యంగా కృషి చేస్తే విజయం సాధించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తూ, మంత్రులందరూ భాగస్వామ్యం తీసుకుంటూ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా

**-రాష్ట్ర యోగా విజేతలకు అభినందనలు**



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులను శనివారం ఉదయం మహాశక్తి ఆలయంలో మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ అభినందించారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయానికి యోగా ప్రతీక అని బండి సంజయ్ పేర్కొంటూ, జాతీయస్థాయిలో కూడా పతకాలు సాధించాలని విజేతలకు సూచించారు. ప్రపంచానికి భగవద్గీతను అందించిన భారతదేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేయడం గొప్ప కృషి అని అన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యోగా సాధన వలన సార్వత్రిక శక్తి, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుందని, వ్యక్తి పరిపూర్ణతకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ యోగా క్రీడాకారుల సంక్షేమాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 30 వరకు రాంచి లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ, అంజనీ కుమార్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కన్న కృష్ణ, గుంటి రామకృష్ణ, స్వరూప చారి, బండ రమణారెడ్డి, యోగా కోచులు కిష్టయ్య, ఆనంద కిషోర్, ప్రవీణ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

# సప్తగిరి కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎన్‌సిడితో కలిసి సప్తగిరి కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఏఎన్ఎం వారీగా సమీక్షించి, ఆరోగ్య కార్యక్రమాల అమలు స్థితిని పరిశీలించారు. ఎన్‌సిడీ క్లినిక్‌లో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసిన బ్లూ, రెడ్ రిజిస్టర్లను పరిశీలించి వారికి మందులు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలను తనిఖీ చేశారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తపోటు, షుగర్ పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందులను వాడుకోవాలని, ఖర్చులు తగ్గించుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్, దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ఐఇసి బోర్డులో ప్రదర్శించిన రక్తపోటు, షుగర్ మందుల వివరాలను పరిశీలించారు. మహిళల రీస్క్రీనింగ్ 100% పూర్తి చేయాలని, రిఫరల్ కేసులను ఫాలోఅప్ చేస్తూ వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమా శ్రీ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాఫీర్ హుస్సేన్, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**జగిత్యాల, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల జిల్లా కార్యాలయంలో బిజెపి ఆధ్వర్యంలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని, అంబేద్కర్ వాదులు కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని, రాజ్యాంగంలో 370, 35A), మైనారిటీ కమిషన్, వక్ఫ్ బోర్డు లాంటి అంశాలు లేవని పేర్కొన్నారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం పదాలను బలవంతంగా చేర్చిందని, అంబేద్కర్‌కు భారతరత్నను కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే భారతరత్న ప్రధానం చేసి, పంచ తీర్థాలను అభివృద్ధి చేసి, రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా జరిపించి, అంబేద్కర్ జయంతిని ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటింపజేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలువాల తిరుపతి, సాంబారి కళావతి, జుంబర్తి దివాకర్, దశరథరెడ్డి, రాగిళ్ల సత్యనారాయణ, మద్రిపెల్లి సత్యమ్, కొక్కు గంగాధర్, ఇట్నేని రమేష్, ఇట్యాల రాము, కాయితి శంకర్, రాపర్తి రాజు, గడ్డల లక్ష్మి, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా M R P S ఆధ్వర్యంలో డా.బి.ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి వేడుకలు



**నల్ల చెరువు డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండల కేంద్రమైన నల్లచెరువులో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భరత్ కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలసి నివాళులర్పించారు భరత్ కుమార్ మాట్లాడుతూ డా.బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో సమానత్వం,న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని,కుల నిర్మూలనకై అట్టడుగు వర్గాల అభ్యున్నతికై జీవితాన్ని ధారపోసిన మహా మేధావి డా.బి.ఆర్. అంబేద్కర్ గారని ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకొని వెళ్లాలని ఆర్థిక వేత్తగా భారత రాజ్యాంగ నిర్మాతగా ఈ దేశానికి ఎనలేని సేవ చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమణ , అంజి, తిరుపాలు, వెంకటస్వామి, శ్రీరాములు, శంకర, శ్రీనివాసులు , సాయి ,తదితరులు పాల్గొన్నారు

# నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు



**పాలకుర్తి, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు నామినేషన్ వేసిన కొందరు అభ్యర్థులు శనివారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అనంతరం పోటీలో కొనసాగుతున్న అభ్యర్థులకు పాలకుర్తి మండలం ఎంపిడిఓ శశికళ గుర్తులను కేటాయించారు. మండలంలోని ఏడు నామినేషన్ కేంద్రాలు అభ్యర్థులతో సందడిగా మారాయి. ఎన్నికల అధికారులు తెలుగు వర్ణమాల ప్రకారం పేర్లను బట్టి గుర్తులు కేటాయించారు. గుర్తులు అందుకున్న అభ్యర్థులు నమూనా బ్యాలెట్ పేపర్ల కోసం ప్రింటింగ్ ప్రెస్, గుర్తుల బొమ్మల సామగ్రి కోసం షాపుల వద్దకు పరుగులు పెట్టారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యాన్ని కలిసిన వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు, మేడిపల్లి సత్యానికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. మేడిపల్లి సత్యం నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాలో మరింత బలపడుతుందని రాజేందర్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు.

# సంచలనాత్మక పోకసో కేసు తీర్పు

**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో కరీంనగర్ I అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది. 2022 ఫిబ్రవరి 3న జరిగిన ఈ ఘటనలో మారుతినగర్‌కు చెందిన లారీ డ్రైవర్ మడుపు నర్సింహా చారి బాధితురాలిని బెదిరించి పదేపదే దాడి చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం కోర్టు నర్సింహా చారిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కమిషనరేట్ అభినందించింది. ఇది 2025లో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన 26వ శిక్ష కావడం విశేషం.

# ఆసిఫ్ నగర్ మాజీ సర్పంచ్ కడారి శ్రీనివాస్ బీజేపీ నుండి సస్పెండ్

**కరీంనగర్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ రూరల్ మండలం ఆసిఫ్ నగర్ (బావు పేట) మాజీ సర్పంచ్ కడారి శ్రీనివాస్‌ను భారతీయ జనతా పార్టీ సస్పెండ్ చేసింది. కొత్తపల్లి రూరల్ మండల అధ్యక్షుడు కుంట తిరుపతి శనివారం ప్రకటన విడుదల చేస్తూ, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కడారి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు.

# పంచాయితీ ఎన్నికల సమన్వయ సమావేశం



**హుస్నాబాద్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో మండలాల వారీగా పార్టీ ముఖ్య నాయకులతో పంచాయితీ ఎన్నికల దృష్ట్యా సమన్వయ సమావేశం జరిగింది. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ఎలా వ్యవహరించాలి, మద్దతుదారులను ఏకతాటిపైకి తీసుకురావాలనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో 100 శాతం విజయాన్ని సాధించాలనే లక్ష్యంతో, పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆ గ్రామంలోని ఇతర నాయకులు మద్దతుగా నిలిచి ప్రచారం చేయాలని సూచించారు.

# అభివృద్ధి పనులు, అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**హనుమకొండ, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్ హంటర్ రోడ్ మహింద్ర షోరూం వద్ద కాలనీలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి వాడా, ప్రతి గల్లీ అభివృద్ధి చేయడమే తమ కట్టుబాటు అని తెలిపారు. గతంలో ఈ ప్రాంతాలను పట్టించుకోలేదని, ఇప్పుడు నలభై లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించడం తమ దినచర్యలో భాగమని అన్నారు. కాలనీ వాసులు సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదే రోజు అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, కే యూ డి ఏ చైర్మన్, డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్




రెడ్డి హనుమకొండ డిసిసి భవన్‌లో అంబేద్కర్ చిత్రానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. సభలో మాట్లాడుతూ నాయిని రాజేందర్ రెడ్డి, అంబేద్కర్ జీవిత పోరాటం ప్రతి పౌరుడికి మార్గదర్శకమని, ఆయన రచించిన రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం విలువలను దేశానికి అందించిందని, వాటిని కాపాడడం మనందరి బాధ్యత అని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా పని చేయడం అంబేద్కర్ చూపిన దారిలో నడిచే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు విజయశ్రీ రాజాలీ, మామిండ్ల రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



**హుస్నాబాద్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంసాని రాకేష్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఒక దళిత కుటుంబంలో పుట్టి ఎన్నో అవమానాలు, సమస్యలను ఎదుర్కొని తన కఠోర శ్రమతో సమాజంలో గొప్ప స్థానం సంపాదించారని అన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి సమానత్వాన్ని నెలకొల్పడానికి ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. అంబేద్కర్ కులమత భేదాలు లేకుండా సమాజమంతా ఒక్కటే అని చాటి చెప్పారని, ఆయన వర్ధంతి రోజును సామాజిక సమరసత దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. అంబేద్కర్‌ను ఒక కులానికి లేదా మతానికి పరిమితం చేయడం తప్పు అని, ఆయన భారతదేశానికి ఒక సంపద, గౌరవం అని రాకేష్ అన్నారు. గత 77 సంవత్సరాలుగా ఏబీవీపీ "కులాలకులను కడిగేద్దాం అంబేద్కర్ ఆశయాలు సాధిద్దాం" అనే నినాదంతో సమానత్వం కోసం పనిచేస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, నగర సంయుక్త కార్యదర్శి అంజి, నగర కార్యవర్గ సభ్యుడు సంతోష్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కార్యదర్శి అభిలాష్, కళాశాల సంయుక్త కార్యదర్శి అఖిల్, కార్యకర్తలు అజయ్, సురేష్, వెంకటేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నివాళులు



**హుస్నాబాద్, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా శంకర్ బాబు మాట్లాడుతూ అంబేద్కర్ లేనిదే నిమ్న వర్గాల అభివృద్ధి, హక్కులు సాధ్యం కాదని, సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించడమే ఆయన ఆశయమని అన్నారు. దళితులను కించపరిచే ప్రయత్నాలను సమాజం సహించదని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కృషి అపారమని, ఆయన వల్లే నిమ్న జాతులకు విముక్తి లభించిందని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అంబేద్కర్ జన్మస్థలాన్ని పంచతీర్థ్ కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసి, ఆయన ఆశయ సాధనలో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల దేవేందర్ రెడ్డి, కవ్వ వేణు గోపాల్ రెడ్డి, చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్, ఆశాడపు శ్రీనివాస్, గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, బొప్పిశెట్టి సాయిరామ్, బుర్ర రాజు, నారోజు నరేష్, బోనగిరి రాజేష్, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్‌లో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా



**అమ్రాబాద్, నవంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. భారతదేశ పౌరులైన ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవడం, ఆయన చూపిన మార్గంలో నడవడం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, యురేనియం వ్యతిరేక పోరాటం అధ్యక్షుడు కలుముల నాసరయ్య, మండల నాయకులు జక్క బాల కిష్టయ్య, రేనయ్య చిగుర్ల, కోటయ్య నాయక్, సర్దార్ అశోక్, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అచ్చంపేటలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా

**అచ్చంపేట, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో భారతరత్న, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. పట్టణ కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడెల్లి ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ, అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయానికి ప్రతీక అని, అంటరానితనం మరియు అసమానతల నిర్మూలనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనుకూలంగా రాజ్యాంగాన్ని రచించి పెట్టిన అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన గౌరవమని పేర్కొన్నారు. నేటి యువకులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని, కుల వివక్షతలకు తావు లేకుండా సమాన విలువలతో జీవించినప్పుడే అంబేద్కర్ ఆశయ సాధన సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సౌటా కాశం, కొంకి విజయ్, రాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మేయర్ జెవిఆర్ కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

**డిసెంబర్ 7 హైదరాబాద్‌డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ



సందర్భంగా కేటీఆర్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని శాలుతో సత్కరిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా అయన ప్రజాసేవ, పట్టుదల, నగరాభివృద్ధి కోసం చేసిన కృషిని ప్రశంసించారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్న లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణపై సుస్థిర నిర్ణయాలు తీసుకోనున్నట్లు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మైనార్టీ అధ్యక్షులు జిలాని పాషా, యూత్ అధ్యక్షులు ప్రభు,రాజశేఖర్, సతీష్,మల్లం వెంకటేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి,జోసెఫ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**మంథని, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మంథని పట్టణంలో ఎస్సీ సెల్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమ సమాజ స్వాప్నికుడు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలు దేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన బాటలోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, "జై బాబు జై భీమ్ జై సంవిధాన్" నినాదాన్ని గ్రామ గ్రామాన ప్రజల్లో చైతన్యం కలిగించేలా తీసుకెళ్తామని అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిలి ప్రసాద్, మంథని సత్యం, కొత్త శ్రీనివాస్, శశిభూషణ్ కాచే, కుడుదుల వెంకన్న, మంథని రాకేష్, ఎరుకుల ప్రవీణ్, అజీమ్ ఖాన్ తో పాటు మండల, పట్టణ, యువజన కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

## సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీ ఎం ఎస్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఈముల సత్యనారాయణ నియామకం



**గోదావరిఖని, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీలోని బిఎంఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏఎల్ పి నుండి ఈముల సత్యనారాయణను కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా బిఎంఎస్ జనరల్ సెక్రటరీ వై. సారంగపాణి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ రామగుండం రీజియన్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ గౌడ్, ఆర్ జి–III ఏరియా ఉపాధ్యక్షులు అరుకాల ప్రసాద్, బ్రాంచ్ సెక్రటరీ రౌతు రమేష్, జెయింట్ సెక్రటరీ గోగుల విద్యాసాగర్, పాక కృష్ణ, ఏఎల్ పి ఫిట్ సెక్రటరీ మీనుగు సంతోష్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కందుల మహేష్, ఓసిపి– II కార్యదర్శి మర్రి సంతోష్, ఫిట్ కమిటీ సభ్యులు తిరుపతి, సంతోష్, వెంకటేష్, రమేష్, సురేష్, మహేష్, లక్ష్మణ్, హరీష్, అలాగే కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి వంశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట కలెక్టర్ హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన సందర్భం గ్రామపంచాయితీ ఎన్నికల ర్యాండమైజేషన్ పారదర్శకంగా

**సిద్దిపేట, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హరిత మినర్వా హొటల్‌లో హైకోర్టు న్యాయమూర్తులు జే. శ్రీనివాసరావు, పుల్ల కార్తీక్, లక్ష్మీనారాయణ అలిశెట్టి ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, అదనపు న్యాయమూర్తి జయ ప్రసాద్, జిల్లా కలెక్టర్ కె. హైమావతి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో కొత్త అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టు భవనం ప్రారంభోత్సవానికి వెళ్తున్న క్రమంలో వారు హొటల్‌లో అల్పాహారం కోసం ఆగారు. అనంతరం జిల్లాలోని న్యాయస్థానాల విషయాలపై కాసేపు చర్చించారు.శనివారం ఉదయం సిద్దిపేట ఐడిఓసి మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ హైమావతి, అబ్జర్వర్ హరితల సమక్షంలో



గ్రామపంచాయితీ ఎన్నికలకు సంబంధించిన రెండవ విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను కంప్యూటరైజ్డ్ విధానంలో పారదర్శకంగా నిర్వహించారు. రెండవ విడతలో 1973 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2436 మంది అదనపు ప్రిసైడింగ్ అధికారులు కలిపి 4409 మంది సిబ్బందికి ర్యాండమైజేషన్ జరిగింది. మూడవ విడతలో 1718 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2123 మంది అదనపు ప్రిసైడింగ్ అధికారులు కలిపి 3841 మందికి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇప్పటికే మొదటి విడతలో 3676 మంది సిబ్బందికి ర్యాండమైజేషన్ చేసి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ, మూడు విడతల్లో జరగనున్న గ్రామపంచాయితీ ఎన్నికలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ర్యాండమైజేషన్ అనంతరం తుది జాబితాలను సంబంధిత శాఖలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయితీ అధికారి రవీందర్, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**తిమ్మాపూర్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్, రామకృష్ణ కాలనీలో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్ అభ్యర్థులతో కలిసి పలు వార్డుల్లో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులపై దృష్టి సారించిందని, గ్రామాల అవసరాల మేరకు పనులు మంజూరు చేస్తూ ప్రజలకు తోడ్పాటునందిస్తున్నదని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించడమే కాకుండా కొత్త పనులు కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు.అభివృద్ధి కొనసాగింపుకు పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికైన సర్పంచులకు అభివృద్ధి పనుల




విషయంలో తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహాత్మానగర్ సర్పంచ్ అభ్యర్థి భైరి చంద్రమౌళి, రామకృష్ణ కాలనీ సర్పంచ్ అభ్యర్థి దావు సుజాత సంపత్ రెడ్డి, 8వ వార్డు అభ్యర్థి మాచర్ల అంజయ్య, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కుంట రాజేందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు అలువాల కుమార్, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి, దుర్గాప్రసాద్, గూడ కమలాకర్, ఈగ లింగయ్య, అంకూసు, సోమయ్యగారి అశోక్, కేతిరెడ్డి ప్రభాకర్, లింగారెడ్డి, బి.శ్రావణ్, చందా చంద్రశేఖర్, సుధాకర్, ప్రభాకర్ రాజు, రజనీ, రమ, బూతం అనిల్, తూర్పాటి శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఇంచార్జ్ ఎస్టీఎస్ స్టేట్ ప్రెసిడెంట్ చందు నాయక్ ముందస్తు హౌస్ అరెస్ట్ .

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా అరెస్టు చేసిన పోలీసులు.

**దేవరకొండ,డిసెంబర్ 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండ పట్టణంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జనసేన పార్టీ ఇంచార్జ్ ఎస్వీఎస్ స్టేట్ ప్రెసిడెంట్ చందు నాయక్ ను జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షులు జంగటి శివలను పోలీసులు ముందస్తు గా హౌస్ అరెస్టు చేశారు.అనంతరం చందు నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల స్కాలర్షిప్ విడుదల చేయాలని బీసీలకు 42




శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ,నక్కలగండి ఎస్ఎల్బిసి ప్రాజెక్టుని పూర్తి చేయాలి నక్కలగండి ప్రాజెక్టు సమీప వరదకు ముప్పైన గ్రామాలకు ఆదుకోవాలని దేవరకొండ జిల్లా చేయాలని తెలంగాణ రాష్ట్రంలో వివిధ సమస్యలను పరిష్కరించే విధంగా రేవంత్ రెడ్డిని అడ్డుకుంటామని ఉదయం 4 గంటలకే హౌస్ అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది మీ అరెస్టులకు భయపడేది లేదు ఎన్ని అరెస్టులు చేసిన ఎన్ని కేసులు పెట్టినా మా ఉద్యమం ఆగదని జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్ అన్నారు.

# ఉప్పునుంతలలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు



**ఉప్పునుంతల, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఉప్పునుంతల మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఉందని, అంబేద్కర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే సమాజంలో సమానత్వం, న్యాయం బలపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని మహనీయుని సేవలను స్మరించారు.

# మహబూబాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల శిక్షణ తరగతులు

**మహబూబాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సూచనలతో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.జిల్లాలో తొలి విడతలో ఎన్నికలు జరగనున్న మహబూబాబాద్, గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ఎన్నికల విభాగం మాస్టర్ ట్రైనర్లు కలిసి శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు.



నెల్లికుదురు మండల కేంద్రంలో జరిగిన శిక్షణ తరగతులకు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మధుకర్ బాబు కూచిపూడి హాజరై ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు.గూడూరు మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, కేసముద్రం మండలంలో మధుసుదన రాజు, మహబూబాబాద్ మండలంలో పురుషోత్తం, ఇనుగుర్తి మండలంలో కృష్ణవేణి స్వయంగా పాల్గొని ఎన్నికల విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు, నియమ నిబంధనలపై క్లుప్తంగా శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమాలను అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పర్యవేక్షించారు. శిక్షణకు హాజరైన, గైహాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## అసమానతల లేని సమాజమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి - యాదిలాల్



**హైదరాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర నాయకుడు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకర్ యాదిలాల్ నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమాజంలో అసమానతలు, అన్యాయాలు పూర్తిగా తుదముట్టే రోజే డాక్టర్ అంబేద్కర్ కల సాకారం అవుతుందని చెప్పారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ, ఆ హక్కులు పేదల గడప దాటేలా చేయడం ప్రభుత్వాల బాధ్యతన్నారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడే దిశగా ప్రతి పౌరుడూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.“అంబేద్కర్ చూపిన మార్గం సమానత్వం ఆ మార్గంలో నడవడం మన అందరి ధర్మం” అని యాదిలాల్ స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో పేదలు, వెనుకబడిన వర్గాలకు అవకాశం లభించడం రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. సమాజంలో చివరి వాడి జీవితంలో వెలుగు నిండే వరకూ అంబేద్కర్ సందేశం పోరాటానికి దిక్సూచిగా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కండె సత్యనారాయణ, అర్ధం నరసింహ, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి



**షాద్ నగర్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అసమానతలు లేని సమాజం కోసం జీవితాంతం పరితపించి, భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో బీసీ జనసేన ఆధ్వర్యంలో అంబేద్కర్



వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ జనసేన నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం, భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత అని కొనియాడారు. సమ సమాజ నిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి “సింబల్ ఆఫ్ నాలెడ్జ్”గా గుర్తించాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ జనసేన సీనియర్ నాయకులు చందులాల్ జమాల్పూర్, ఉద్యమకారులు మేకల వెంకటేష్, తగిడిపల్లి శంకర్, జక్కుల జలజ, స్రవంతి రాజ్, భాగ్యలక్ష్మి, గడ్డమీది రమేష్, అలాగే కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, జర్నలిస్ట్ కొమ్ము వెంకన్న బాబు, దంగు శ్రీనివాస్ యాదవ్, యుటిఎఫ్ జనార్ధన్, నక్క బాలరాజ్ యాదవ్, మొన్నే రవి, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్షల నోటిఫికేషన్

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ 1, 3, 5 (మొదటి, మూడవ,




ఐదవ) సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపుపై నోటిఫికేషన్ విడుదలైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్, అంబేద్కర్ సార్వత్రిక అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎం. అంజయ్య ఈ విషయాన్ని వెల్లడించారు.విద్యార్థులు డిసెంబర్ 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించి, రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

**పరీక్షల షెడ్యూల్ ఇలా ఉంది:**

5వ సెమిస్టర్: ఫిబ్రవరి 7 నుండి 12 వరకు
3వ సెమిస్టర్: ఫిబ్రవరి 13 నుండి 20 వరకు
1వ సెమిస్టర్: ఫిబ్రవరి 22 నుండి 28 వరకు

మరిన్ని వివరాలకు విద్యార్థులు కళాశాలను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## సర్పంచ్ అభ్యర్థి మక్కపల్లి స్వరూప గెలుపు కోసం మేడిపల్లి లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం



**ఇబ్రహీంపట్నం , డిసెంబర్ ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: యాచారం మండలం నక్కర్త - మేడిపల్లి మేజర్ పంచాయతీలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో తమ అభ్యర్థుల గెలుపు కోసం ఆయా రాజకీయ పార్టీలు జోరుగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. మేడిపల్లి పంచాయతీలో బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి మక్కపలి స్వరూప శ్రీనివాస్ గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మక్కపల్లి స్వరూప శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గా నాకు ఓటు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం : డాక్టర్ రాజునాయక్



**యాచారం , డిసెంబర్ ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నందివనపర్తి గ్రామానికి చెందిన పెరుమాళ్ల లక్ష్మమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు . సమాచారం తెలుసుకున్న BRS పార్టీ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ డాక్టర్ రాజునాయక్ తన మానవత భావాన్ని చాటుతూ మృతురాలి కుటుంబానికి తన వంతుగా రూ. 10,000 -/ రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ సర్పంచ్ అభ్యర్థి గోరటి వెంకటేశం , మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి , కాలనీ వాసులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు





**యాచారం , డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాజ్యాంగ నిర్మాత భారతరత్న అవార్డు గ్రహీత బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు మొండి గౌరెల్లి సర్పంచ్ అభ్యర్థి కోలన్ రమాదేవి మల్లా రెడ్డి . ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యాన్ని బలపరచడంలో అంబేద్కర్ పోషించిన పాత్ర అపూర్వమని కొనియాడారు. ప్రతి భారత పౌరుడు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని చదవాలని, అంబేద్కర్ చూపిన మార్గం మనల్ని చైతన్యవంతమైన సమాజం వైపు నడిపిస్తుందని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల బీజేపీ మాజీ అధ్యక్షులు రవీందర్, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనోహరాబాద్‌లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**మనోహరాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు ఘనంగా నివాళు లర్పించారు.గ్రామంలోని హరిజన బస్తీ నుండి ప్రధాన రహదారి వరకు అంబేద్కర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి ప్రజలు రోడ్డుపైకి వచ్చి ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని, సమసమాజ నిర్మాణం జరగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి, పొట్టోల్ల వెంకట్ గౌడ్, వెంకట్ రెడ్డి, జావేద్, ఐలయ్య, కృష్ణ గౌడ్, శ్రీనివాస్‌తో పాటు ఎంఆర్పిఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**గజ్వేల్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, రాష్ట్ర నాయకులు గంప వేణు గోపాల్ కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమసమాజ నిర్మాణం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

# సామాజిక సేవలో యువత ముందుకు రావాలి



**కల్వకుర్తి, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం, భారతదేశ ఐక్యరాజ్య సమితి వాలంటీర్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాలంటీర్స్ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. "యువత నాయకత్వ లక్షణాలు, దేశంలో సామాజిక సేవల వలన ఉపయోగాలు" అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది.జాతీయ యువజన అవార్డు గ్రహిత శివ కుమార్ మాట్లాడుతూ యువత సామాజిక సేవలో ముందుకు రావడం వలన దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఐక్యరాజ్య సమితి వాలంటీర్స్ సంస్థలో ప్రతి ఒక్కరూ ఆన్లైన్‌లో వాలంటీర్స్‌గా నమోదు చేసుకోవాలని, అలా చేస్తే యువతకు అంతర్జాతీయ స్థాయిలో పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. చదువుతో పాటు సామాజిక స్పృహ పెంచుకొని దేశ సమస్యలపై కొత్త ఆలోచనలు రూపొందించాలన్నారు. యువతకు ప్రభుత్వంలో అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం కళాశాలలో ఉత్తమ విద్యార్థులకు ఐక్యరాజ్య సమితి వాలంటీర్స్ టీషర్టులు, డైరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, సేవా బృందం సభ్యులు లక్ష్మి నర్సింహా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి

### దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.



**దేవరకొండ,డిసెంబర్ 06(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవంలో శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్69 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .అధ్యక్షుడు ఎన్ వి టి,, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్ సభ్యులతో కలిసి పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయులని మరువరాదని,డా. బి.ఆర్. అంబేద్కర్ గొప్పతనం అతని బహుముఖ ప్రతిభలో ఉందని ఆయన భారత రాజ్యాంగ నిర్మాత, న్యాయవాది, ఆర్థికవేత్త, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త, మరియు దళిత, మహిళా, కార్మిక హక్కుల కోసం పోరాడిన వ్యక్తి. కుల వివక్ష నిర్మూలనకు, సామాజిక సమానత్వానికి, మరియు అణగారిన వర్గాల సాధికారతకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, చంద్రశేఖర్, శేఖర్, రాంబాబు, రమేష్, సత్యం, రవి, సుందర్ రాజకుమార్, శ్రీకాంత్, పవన్, ప్రవీణ్, ఎస్ పి ఆర్ స్కూల్ విద్యార్థులు క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ రాజ్యాంగం దేశాలకు స్ఫూర్తి

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,డిసెంబర్ 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. "ఆర్టికల్ 3 వల్లే చిన్న రాష్ట్రాల ఏర్పాటు సాధ్యమై, తెలంగాణ ఏర్పాటుకు దారి తెరిచింది. అంబేద్కర్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి" అని తెలిపారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్లు నాగన్న యాదవ్, కంచె రవి, నీలస్వామి, సంపత్ రెడ్డి, కరుణాకర్, ఎర్రమన్యం, బషీర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయ బృంద




**వనపర్తి,డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లా కేంద్రంలోనిమాస్టర్ మైండ్స్ హై స్కూల్ విద్యార్థి G. రుద్ర తెలంగాణ స్టేట్ లెవెల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో అండర్ 13, 14, 15 విభాగాలతో పాటు 57 కేజీల బరువు వర్గంలో ఎంపికై ప్రతిభ చాటాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, "స్పోర్ట్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివి. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా సంచలనాలు సృష్టించవచ్చు. రుద్ర సాధించిన విజయమే దానికి నిదర్శనం" అని అన్నారు.ఉపాధ్యాయ బృందం రుద్రకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు, పతకాలు సాధించాలని ఆకాంక్షించింది.

# వెల్దండలో పి.ఓ.ఎస్. ట్రైనింగ్ కార్యక్రమం

**వెల్దండ, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల, సర్పంచ్ వార్డుల సభ్యుల నిర్వాహణకు సంబంధించి పి.ఓ.ఎస్. ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. మండల ఎంపీడీవో కె. సత్యపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్టేజ్ -II అధికారులు శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు ఎన్నికల విధులపై పి.ఓలకు మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో



ఓటర్లతో ఎలా మెలగాలి, ఓటు వేయించే విధానం, సంతకం నమోదు, ఆధార్ కార్డు లేదా గుర్తింపు పత్రం చూపించాల్సిన అవసరం, విధి నిర్వహణలో జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. ఓటు ప్రక్రియలో ప్రతి



ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో వెల్దండ ఎమ్మార్వో కార్తీక్ కుమార్, ఎంఈఓ చంద్రుడు, జోనల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతి గది ప్రారంభం






**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్, డిజిటల్ తరగతి గదిని శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, డిఇఓ రమేష్ కుమార్, దాతలు డాక్టర్ సునీల్ చౌదరి కాజా, పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో జస్టిస్ మాధవి దేవి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలతో పాటు డిజిటల్ నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. టెక్నాలజీ నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ముందంజలో ఉంటారని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆమె సూచించారు. అమెరికాలో స్థిరపడి తెలుగు డాక్టర్స్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ద్వారా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ తరగతులను సమర్థంగా వినియోగించుకుని ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని సూచించారు. చదువు ప్రధాన మార్గమని, విద్యార్థులు ఇతర రంగాల్లో కూడా రాణించేందుకు ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి కంప్యూటర్ల వినియోగం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలో చదివిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, క్రమశిక్షణతో చదువుకొని దేశభక్తి, దైవభక్తితో రాణించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థి సుధాకర్ గౌడ్ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్సిసి విద్యార్థులు ముఖ్య అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు లత, పూర్వ విద్యార్థులు అర్థం రవి, సుధాకర్ గౌడ్, నర్సింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ




**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లాలో జరగనున్న తొలి విడత పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో 55 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఇతర అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా గమనించాల్సి ఉంటుందని, పీవోలు, ఏపీవోల విధుల్లో జోక్యం చేసుకోరాదని సూచించారు. పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకల్లా నిర్దేశిత కేంద్రాలకు చేరుకోవాలని, అభ్యర్థుల ఏజెంట్లు మినహా ఇతరులను కేంద్రంలోకి అనుమతించరాదని, వాటర్ బాటిల్లు, సెల్‌ఫోన్లను కూడా అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ తరపున కళ్లూ, చెవుల్లా పనిచేయాలని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటికి 55 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. మూడు దశల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వర్తించి నివేదికలు సమర్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పరిషత్ అదనపు సిఈవో గోపాల్ నాయక్, డిపిఓ శ్రీరాములు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నిజాంపేట్‌లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**నిజాంపేట్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. నిజాంపేట్, రాజీవ్ గృహకల్ప, ప్రగతి నగర్ కమాన్ బావార్చి వద్ద ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఐక్యవేదిక చైర్మన్, దళిత రత్న అవార్డు గ్రహీత మేకల నగేష్ మాట్లాడుతూ అంబేద్కర్ కలలుగొన్న స్వరాజ్యాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడలో నడవాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఆయన ఆశయం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సేవల సేన జాతీయ సంస్కృతిక సేన అధ్యక్షులు డాక్టర్ ఎస్.పి. నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర నాయక్, గోపాల్ మహారాజ్, దళిత రత్న అవార్డు గ్రహీత, మాల కులాల యునైటెడ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొదమగండ్ల అమృతయ్య, బాల పీరు, ముత్యాలు, లబిశెట్టి నరేష్ గుప్తా, పాల శ్రీనివాసులు, సురేష్, శ్రీనివాసులు, రవీందర్ నాయక్, మల్లయ్య నాయక్, శంకరన్న, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్‌లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆదర్శనగర్ ఆడిటోరియంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు ఘనంగా జరిగింది. నేషనల్ దళిత సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ బుధాల అమర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హన్మంత్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం పటిష్టమైన రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళితులపై దాడులు, రాజ్యాంగ మార్పు ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆయన విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల అమలు ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, రేవంత్ రెడ్డి ప్రజా పాలన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ బుధాల అమర్ బాబు, జాతీయ ఉపాధ్యక్షులు బాబురావు, రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు మూడు ఐలయ్య గౌడ్, అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు జమ్స్, దళిత సేన ప్రధాన కార్యదర్శి వై. బాలరాజు, జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ, యువజన విభాగం అధ్యక్షులు ఆనంద్ బాబు, 126వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే. గణేష్, 127వ డివిజన్ అధ్యక్షుడు బి. శివకుమార్, మాధవి రాణి, కమల, దళిత నాయకులు హనుమకొండ ప్రేమ్ కుమార్, విజయ భాస్కర్ రావు, సిద్ధన్న, బూరుగుర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులి నాగారంలో వేడెక్కిన రాజకీయం



**మహేశ్వరం, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం, మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామంలో రాజకీయ వాతావరణం రోజురోజుకు వేడెక్కుతోంది. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోటాపోటీ ప్రచారాలు గ్రామాన్ని కదిలిస్తున్నాయి. బీజేపీ తరఫున కుండే కుమార్, కాంగ్రెస్ పార్టీ తరఫున కుండే ఈశ్వరయ్య, టిఆర్ఎస్ పార్టీ తరఫున బండారి లింగం ముదిరాజ్ బరిలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పాతర్ల సత్యనారాయణ, పల్నాటి యాదయ్య నేత, పల్నాటి అశోక్ నేతలు పోటీ చేస్తున్నారు. గ్రామంలో హామీల వర్షం కురిపిస్తున్న నాయకులు ప్రజలను ఆకర్షించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. మూడో విడత పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు ఆలోచించి అడుగులు వేస్తూ, సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారు. వార్డు సభ్యుల ఎన్నికల్లో కూడా పెద్ద ఎత్తున హామీలు ఇవ్వడం జరుగుతోంది. డిసెంబర్ 17న జరగనున్న పోలింగ్‌లో విజేత ఎవరో తెలుసుకోవాలని గ్రామ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రజలు మాత్రం అభివృద్ధి చేస్తూ, సమస్యలు తీర్చే, ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడికే ఓటు వేస్తామని స్పష్టంగా చెబుతున్నారు. ఇప్పటివరకు తొమ్మిది మంది సర్పంచులు మాజీలుగా నిలిచారు. పదో సర్పంచ్‌గా ఎవరు వస్తారో చూడాలని గ్రామ ప్రజలు ఆసక్తిగా వేచి చూస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**గాజులరామారం, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆకర్షితులైన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ -బి పరిధిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహమ్మద్ హనీఫ్ ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో కండువా కప్పుకొని వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ వస్తోందని తెలిపారు. ప్రతి తెల్ల కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేస్తూ, రేషన్ కార్డుల పంపిణీ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతోందని గుర్తు చేశారు. కాలనీ సంక్షేమ అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో నవీన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, ప్రశాంత్ కుమార్, మహమ్మద్ జైబుయిన్, విష్ణువర్ధన్, ఎల్లయ్య, రాములు, వెంకటయ్య, మధుసూదన్ గౌడ్, ప్రభావతి, వెంకటమ్మ, హాలీ బేగం, నాగరాణి, అరుణ, లావణ్య, రాణి, పద్మమ్మ, యాదమ్మ, వనిత తదితరులు ఉన్నారు.

# అచ్చంపేటలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు



**అచ్చంపేట, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అచ్చంపేట పట్టణ కేంద్రంలో భారతరత్న, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసిన అంబేద్కర్ ఆశయాలను ప్రతి పౌరుడు చదివి, అవగాహన చేసుకుని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అచ్చంపేట పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్స్ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పరిశీలన

## కొమురవెల్లి కళ్యాణ జాతర ఏర్పాట్లు



**సిద్దిపేట, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దౌలతాబాద్ మండలంలోని దొమ్మాట, సూరంపల్లి, దౌలతాబాద్ కేంద్రం, ఇందుప్రియాల్, తిరుమలాపూర్ గ్రామాల్లోని పాఠశాలలు, రాయపోల్ మండలంలోని రాయపోల్, అనాజిపూర్, మంతూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు విద్యుత్, లైట్స్, ఫ్యాన్స్, ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఫర్నిచర్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినందున వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను కూడా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి సెంటర్, పాఠశాలలోని విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించి, తెలుగు పద్యాలు పలికించారు. బాగా చదువుకోవాలని, ఉపాధ్యాయుల మాట వినాలని విద్యార్థులకు సూచించారు. అదే రోజు కలెక్టర్ కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి వారి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 14న జరిగే కళ్యాణం, ఉగాది వరకు కొనసాగే జాతరలో భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తోటబవి ప్రాంతంలో వీఐపీ, మీడియా గ్యాలరీలు, సామాన్య భక్తుల దర్శనానికి సౌకర్యాలు కల్పించాలని, అంగరంగ వైభవంగా డెకరేషన్ చేయాలని సూచించారు. భక్తుల కోసం వాహనాల పార్కింగ్, స్నానగృహాలు, మరుగుదొడ్లు యుద్ధ ప్రాతిపదకన నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించి, చెత్త చెదారం లేకుండా శుభ్రతను కాపాడాలని, కార్మికుల పనితీరును పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్లను నియమించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. బస్టాండ్ ఆవరణ శుభ్రత, ఆర్టీసీ సౌకర్యాలు, గుట్టపై నిర్మాణంలో ఉన్న అతిథి గృహాలు, విద్యుత్, మిషన్ భగీరథ, సీసీ రోడ్ల పనులను కళ్యాణానికి ముందే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, అర్ అండ్ బి అధికారులు, తహసిల్దార్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.

## స్క్రూటినీ తీరును పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు.





**ఎలిగేడు, డిసెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మరియు సుల్తానాపూర్ గ్రామపంచాయతీ ఎన్నికల క్లస్టర్లలో నామినేషన్ స్క్రూటీని శనివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఏనుగు నరసింహారెడ్డి పరిశీలించినారు. ఈ సందర్భంగా సర్వీస్ ఓటర్స్, పోస్టల్ బ్యాలెట్, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పట్టికల సమర్పించుట గురించి వివరించారు. వారితోపాటు తాసిల్దార్ యాకన్న ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

## ఉత్తమ హెూంగార్డుగా ప్రశంసా పత్రము అందుకున్న శంకర్



**ఎలిగేడు, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కవ్వంపల్లి శంకర్ ఉత్తమ హెూంగార్డుగా ప్రశంసా పత్రము అందుకున్నారు. హెూంగార్డ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, ఎన్నికల నిర్వహణ, నైట్ పెట్రోలింగ్, నేర నిరోధం, విపత్తు నిర్వహణలో హెూంగార్డుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ హెూంగార్డు ప్రశంసా పత్రం అందుకున్న శంకర్‌ను గ్రామస్తులు అభినందించారు.

## ఎలిగేడు మండలంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**ఎలిగేడు, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన నిర్మించిన రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని, యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు, లాలపల్లె సర్పంచ్ అభ్యర్థులు కవ్వంపల్లి చంద్రయ్య, ఏలేటి వెంకటరెడ్డి, భూష శారదతో పాటు వివిధ సంఘాల నాయకులు బైరెడ్డి రామిరెడ్డి, కళ్లెం శ్రీనివాసరెడ్డి, మామిడాల రమేష్, కోడూరు శ్రీనివాస్, కప్పల సాయిలు, న్యాతరి పోచాలు, బాసంపల్లి వినోద్, సమాని రాజు తదితరులు పాల్గొన్నారు.

## లాలపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిపై ఫిర్యాదు



**ఎలిగేడు, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఏలేటి వెంకట్ రెడ్డి పై మరో అభ్యర్థి బాసంపల్లి రాజేష్ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎం.పి.డి.వో భాస్కర్ రావుకు ఫిర్యాదు చేశారు. వెంకట్ రెడ్డి ఇప్పటికే ఎలిగేడు సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ, దీనిపై పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని రాజేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాం రెడ్డి, మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు, నాయకులు న్యాతరి పోచయ్య, బద్దం తిరుపతి రెడ్డి, బాసంపల్లి వినోద్, సుజికి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహబూబాబాద్ పట్టణంలో ముందస్తు భద్రతా చర్యలు



**మహబూబాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ పట్టణంలో శాంతి భద్రతలను కాపాడే లక్ష్యంతో జిల్లా ఎస్పీ డాక్టర్ షబరీష్ ఆదేశాలు, ఆర్ఐ(అడ్మిన్) అనిల్ సూచనల మేరకు, పట్టణ సీఐ మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై షాకీర్ నేతృత్వంలో టౌన్ పోలీసు వ్యవస్థ ముందస్తు భద్రతా చర్యలను చేపట్టింది. ఈ క్రమంలో పట్టణంలోని ప్రముఖ మసీదులు, దర్గాలు, తొర్రూర్ బస్టాండ్, నెహ్రూ సెంటర్, మదర్ తెరిసా సెంటర్, బస్టాండ్ పరిసరాలు, ప్రముఖ దేవాలయాలు, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంల వద్ద బాంబ్ స్క్వాడ్ బృందం సవివర తనిఖీలు నిర్వహించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి మూలన పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. తనిఖీలలో బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు పీసీ 514, పీసీ 389, డాగ్ హ్యాండ్లర్ పీసీ 265, అలాగే బ్లూకోట్ సిబ్బంది పాల్గొని ప్రాంతాలను సంపూర్ణంగా పరిశీలించారు. ప్రజల భద్రతను ప్రధానంగా భావిస్తూ పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## మహబూబాబాద్‌లో పాఠశాలల్లో న్యాయ చైతన్య సదస్సులు




**మహబూబాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమనగల్, శనిగపురం పాఠశాలల్లో న్యాయ చైతన్య సదస్సులు ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమనగల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శనిగపురంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బాలల హక్కులు, ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజు కృష్ణ ప్రసంగిస్తూ పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, జువెనైల్ జస్టిస్ యాక్ట్, విద్యా హక్కు చట్టం వంటి కీలక చట్టాలను వివరించారు. న్యాయ విజ్ఞానం పెంపుతో సమాజంలో చట్టపరమైన చైతన్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. బాల బాలికలు ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను, మహబూబాబాద్ జిల్లా కోర్టు భవనాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సదస్సుల్లో అమనగల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, శనిగపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు స్వర్ణ, మల్లికార్జునులు పాల్గొని విద్యార్థులలో న్యాయ విజ్ఞానం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం విద్యార్థులకు చట్టపరమైన అవగాహన పెంపుకు దోహదం చేస్తుందని వారు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

# మహబూబాబాద్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**మహబూబాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, వుమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో భరోసా టీం, సైబర్ క్రైమ్ టీం కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. భరోసా ఎస్సై ఝాన్సీ, సైబర్ క్రైమ్ ఎస్సై కరుణాకర్, పాఠశాల ఇన్చార్జి హెడ్‌మాస్టర్ సుగుణ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 550 మంది విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో మాయమాటలు చెప్పి మోసాలు చేసే విధానాలు, మహిళలపై లైంగిక వేదింపులు, సోషల్ మీడియా వేదికలైన ఇన్స్టాగ్రాం, ఎఫ్బిలో జరుగుతున్న సైబర్ నేరాలను నాటక రూపంలో వివరించారు. సైబర్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్టులు, లోన్ యాప్ మోసాలు, సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ బెదిరింపులు వంటి అంశాలను కేస్ స్టడీలతో విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలోనే నివారించవచ్చని వక్తలు పేర్కొన్నారు. భరోసా సెంటర్ విధులు, మహిళలు పిల్లలకు అందిస్తున్న సదుపాయాలు, పోక్సో చట్టం, సంబంధిత కేస్ స్టడీలను కూడా విద్యార్థులకు వివరించారు. చివరగా విద్యార్థుల చేత సైబర్ నేరాల నియంత్రణకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుగుణ, అధ్యాపక సిబ్బంది, భరోసా ఇంచార్జ్ ఎస్సై ఝాన్సీ, సైబర్ క్రైమ్ ఎస్సై కరుణాకర్, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ కౌన్సిలర్ చి. జ్యోష్ణ, సపోర్ట్ పర్సన్ కె. బెబీ, డి.ఇ.ఓ అకౌంటెంట్ బి. రేణుక, రిసెప్షనిస్ట్ డి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నితీశ్ కుమార్



**పాట్నా, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందన లేఖను పంపింది. ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. “1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం” అని ప్రశంసించింది. సుపరిపాలన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## పురుషుడిపై మహిళ అత్యాచారం

### మహారాష్ట్రలో విచిత్ర ఘటన



**పూణె, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, “నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను” అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## రూ.1000 కోట్లతో ఓయూ అభివృద్ధి

**కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా ఉస్మానియా**
**ధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**
**10న ఓయూను సందర్శించనున్న సిఎం**



**హైదరాబాద్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) రూపురేఖలను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా, అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఓయూను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్లకు పైగా వెచ్చించాలని నిర్ణయించింది. ఈ బృహత్ ప్రణాళిక అమలుపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా వర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాలు, మెగా హాస్టళ్లు, హైటెక్ అకడమిక్ బ్లాకులు నిర్మించనున్నారు. వీటితో పాటు సైకిల్, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా సదుపాయాలు, హెల్త్ కేర్ సెంటర్, కన్వెన్షన్ హాల్ వంటి ఆధునిక హంగులను కల్పించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన డిజైన్ నమూనాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, వారి సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓయూ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా చిహ్నాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీలోని చారిత్రక, వారసత్వ కట్టడాలను సంరక్షించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఓయూ అభివృద్ధికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ నెల10న తాను ఓయూను సందర్శిస్తానని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# రాజీమార్గమే రాజమార్గం

**-జాతీయ లోక్ అదాలత్‌కు సిద్ధమైన అధికారులు**



**షాద్ నగర్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిసెంబర్ 21న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా షాద్‌నగర్ కోర్టు కాంప్లెక్స్‌లో పోలీసు, బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని 16వ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. స్వాతి రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని, చిన్న చిన్న గొడవలు, వ్యక్తిగత దూషణలు, బ్యాంకులకు సంబంధించిన కేసులను నిరంతరం కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం పొందుతాయని, కక్షిదారులు పరస్పర రాజీ చేసుకోవడం వల్ల న్యాయం త్వరగా జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి పాల్గొన్నారు. పోలీసులు, బ్యాంకు అధికారులు వీలైనన్ని ఎక్కువ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్, రూరల్ ఎస్సై శ్రీనివాస్, కేశంపేట ఏఎస్ఐ శ్రీనివాసులు, షాద్‌నగర్ పట్టణ ఎస్సై రామచందర్, నందిగామ ఏఎస్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సబ్‌ఇన్స్పెక్టర్ వెంకటేష్, కొందుర్గ్ ఎస్సై బాలస్వామి, ఫరూక్‌నగర్, కొత్తూరు, తిమ్మాపూర్ ప్రాంతాల బ్యాంకు అధికారులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ నందిగామ అధికారులు, కెనరా బ్యాంక్ షాద్‌నగర్ బ్రాంచ్ మేనేజర్, కోర్టు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ ఎస్ నాయకులు



**కడ్తాల్, డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి గ్రామంలో పలువురు బిఆర్ ఎస్ నాయకులు పీసీసీ సభ్యులు అయిల్లా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారికీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ లో చేరిన వారు రావుల నర్సింహ గౌడ్ , ఉడుతాల రమేష్, రామవత్ రమేష్,జాతవత్ రవి,రామవత్ అనిల్,నల్లవోతుల శ్రీను,నేనవత్ హర్యా,రామవత్ చరణ్,కళ్ల నర్సింహ,పోతుగంటి జంగయ్య,పోతుగంటి శివ,పోతుగంటి మైసయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది ఈ కార్యక్రమంలో లోమాజీ సర్పంచ్ శంకర్, సర్పంచ్ అభ్యర్థి నేనవత్ బజ్యా శ్రీను,గ్రామ అధ్యక్షులు క్యాతిక వెంకటేష్ , జగన్ గౌడ్, రాజు గౌడ్ కంబల రామకృష్ణ క్యాతిక కేశవులు,ఫనీంద్ర గౌడ్, జన్య భారత్ ,యాదయ్య, నిరంజన్ ,శ్రీశైలం, దేవ్వశ్రీనివాస్ గౌడ్, శివ గౌడ్ దేవేందర్, లడ్డు రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబెడ్కర్ వర్ధంతి వేడుకలు



**కడ్తాల్, డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహేబ్ భీంరావు రాంజీ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను కడ్తాల్ మండలంలో అంబేద్కర్ సంఘం, అన్ని పార్టీల నాయకులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

## గానుగుమర్ల తండా సర్పంచ్ సేవ్య నాయక్ కు అభినందనలు తెలిపిన గంప వెంకటేష్ గుప్తా

**గానుగుమార్ల తండా సర్పంచ్ ఏకగ్రీవం**



**కడ్తాల్, డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండలంలోని గానుగుమార్ల తండా సర్పంచ్ బాణావత్ సేవ్య నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పోటీలో ఉన్న వ్యక్తులు తమ నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా సేవ్య నాయక్ కు అభినందనలు తెలిపారు. ఆమనగల్ సింగల్ విండో డైరెక్టర్ గా ఉన్న సేవ్య నాయక్ గత కొంతకాలంగా రైతులకు ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల వెంకటేష్ గుప్తా ఆయనకు అభినందనలు తెలిపి స్వీట్ తినిపించారు.

## అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నివాళి



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అబ్దుల్లాపూర్ మెట్‌లో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ చెక్‌పోస్ట్ వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ మాట్లాడుతూ దేశానికి దశా, దిశ చూపిన మహనీయుడు అంబేద్కర్ సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు పోరాడారని, ఆయన ఆశయాల కోసం ఓటు వేసినప్పుడే ఆ మహనీయుడి ఆత్మ శాంతిస్తుందని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్, నాయకులు చిత్రం కృష్ణ, గట్టు నరసింహ, మంద శివ, చిత్రం బాలరాజ్, బంటి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని లష్కర్ గూడ, సురమై గూడ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఆల్లె ఐలయ్య యాదవ్ డోర్ టు డోర్ ప్రచారాన్ని వేగంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచిన తర్వాత గ్రామ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతానని ఓటర్లకు హామీ ఇచ్చారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎలాంటి ఆపదలోనైనా ముందుండి పనిచేస్తానని, గ్రామ సేవకునిగా ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటానని తెలిపారు. ఓటర్లను ఉద్దేశించి ఈ ఒక్కసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.

# గుర్తులు వచ్చేశాయి..
# గుబులు రేపుతున్నయ్.!















**ప్రింటింగ్ ప్రెస్ లకు పరుగులు తీసిన అభ్యర్థులు**

**గెలుపు ధీమాతో హెూరా హెూరి ప్రచారాలు**

**రోజురోజుకు వేడెక్కుతున్న పల్లెపోరు**

**కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో జోరందుకున్న ప్రచారాలు**

**కడ్తాల్, డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లతో ప్రారంభమైన పంచాయతీ పోరు మరో అంకానికి చేరుకుంది. శనివారం ఎన్నికల అధికారులు అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. పోటీల్లో ఉన్న సర్పంచ్, వార్డ్ అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. గుర్తులమేరకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార సామాగ్రిని కొనుగోలు చేసేందుకు పరుగులు పెడుతున్నారు. ప్రచారానికి వారం రోజుల సమయం మాత్రమే ఉండడంతో అభ్యర్థులు తమ ప్రచార గుర్తులతో విస్తృత ప్రచారానికి ప్రణాళికలు రచిస్తున్నారు. గ్రామాల్లో తమ మద్దతుదారులతో ప్రతి గడపకు తమ గుర్తులు అందించి ఓటును అభ్యర్థించే పనిలో నిమగ్నం అవుతున్నారు.

**గుర్తులు గుర్తుండేలా అభ్యర్థుల పరుగులు..**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో మరో పర్వం ప్రారభమైంది. పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. దీంతో వారికి కేటాయించిన గుర్తుల సామాగ్రిని కొనుగోలు చేసేందుకు అభ్యర్థులు పరుగులు పెడుతున్నారు. గుర్తులతో ఉన్న టోపీలు, కండువాలు, కీ చైన్లు, బొట్టు బిళ్ళలు, జెండాలు, కరపత్రాలు తదితర ప్రచార సామాగ్రిని కొనుగోలు చేసేందుకు దుకాణాలకు పయనం అవుతున్నారు. వినూత్న ప్రచారం సామాగ్రితో ఓటర్లను ఆకర్షించేందుకు ముందుకు సాగుతున్నారు.

**ఊరు అభివృద్ధే లక్ష్యంగా అభ్యర్థుల మేనిఫెస్టో..**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో మౌళిక వసతులు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల మేనిఫెస్టోను తయారుచేసి ప్రచారం చేసుకుంటున్నారు. సమస్యల పరిష్కారానికి ఖచ్చితమైన హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ప్రజల్లో ఉంటా అభివృద్ధికి పాటుపడతానంటూ ప్రచారం మంత్రాన్ని హెూరెత్తిస్తున్నారు

**ప్రింటింగ్ ప్రెస్ లు బిజీబిజీ**

ప్రింటింగ్ ప్రెస్ లు గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రిని విక్రయిస్తున్నారు. దీంతో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులతో కూడిన ఎన్నికల సామాగ్రిని విక్రయించేందుకు సిద్ధం చేయగా కొనుగోలుదారులతో షాపులు బిజీబిజీగా సందడి వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల జెండా రంగులతో సర్పంచ్ అభ్యర్థుల గుర్తుల జెండాలను కండువ, టోపీల ప్రచార సామాగ్రిని విక్రయాలకు సిద్ధం చేశారు. కడ్తాల్, ఆమనగల్లు పట్టణాల్లో ప్రింటింగ్ ప్రెస్ దుకాణాల వద్ద ఎన్నికల సామాగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసింది.

# సామాన్యుడి కోసమే సుప్రీంకోర్టు..

## పెండింగ్ కేసుల పరిష్కారానికి కాల వ్యవధి ఉండాలి: సీజేఐ సూర్యకాంత్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
సామాన్యుడి కోసమే సుప్రీంకోర్టు ఉందన్న బలమైన సందేశాన్ని పంపుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి ఓ నిర్దిష్ట గడువును నిర్ణయించేందుకు ఉమ్మడి జాతీయ జ్యుడీషియల్ విధానం ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం పిలుపునిచ్చారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీజేఐ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండాలని అన్నారు. వ్యాజ్యం ఖర్చును ఎలా తగ్గించాలి, కేసులపై నిర్ణయం తీసుకునేందుకు తగిన కాల పరిమితిని ఎలా నిర్దేశించాలి అన్న విషయాలే ఇప్పుడు తన ప్రాధాన్యతలని ఆయన చెప్పారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ అధికారాల వికేంద్రీకరణకు సంబంధించి రాజ్యాంగ



నిబంధనను ఆయన గుర్తు చేశారు. పెండింగ్ కేసులన్నీ పూర్తిగా పరిష్కారానికి నోచుకుంటాయని తాను చెప్పడం లేదని, అది ఎన్నటికీ జరగదని, లిటిగేషన్ నిరంతర ప్రక్రియ కావడమే ఇందుకు కారణమని ఆయన అన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉందని ఆయన తెలిపారు. కొత్త కేసులు దాఖలవుతూనే ఉంటాయని, కాని పాత కేసులను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వాన్ని సాధనంగా మార్చుకోవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# లైఫ్ సపోర్ట్‌పై ఇండియా కూటమి



**న్యూఢిల్లీ డిసెంబర్ 6 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
'ఇండియా కూటమి' లోపాలపై సీఎం ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష 'ఇండియా కూటమి' అంపశయ్యపై (లైఫ్ సపోర్ట్)పై ఉందని అన్నారు. శనివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, నితీశ్‌కుమార్ బీహార్‌లో ఎన్డీయే చేతుల్లోకి వెళ్లడానికి తామే కారణమని అన్నారు.బీహార్‌లో మొత్తం విపక్షం బలహీనపడిందని అన్నారు. రేపటి నాడు జార?ండ్ ముక్తీ మోర్చా (జేఎంఎం) కూడా కూటమి నుండి బయటకు వెళ్లే పరిస్థితులు రావొచ్చునని హెచ్చరించారు.